
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
నల్లగొండ
3
మంగళవారం 21 మే 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972


చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.169	245	279
సూర్యాపేట	రూ.165	250	280
నల్లగొండ	రూ.166	252	286

ఉష్ణోగ్రత గరిష్ఠం 39.5 । కనిష్ఠం 24.8

రైతు గుండెలో అలజడి



నిండు వేసవిలో వర్షాకాలంలా సాయంత్రం మబ్బులు కమ్ముకుంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా నాలుగు రోజులుగా ఈదురుగాలులు, వడగళ్లతో కూడిన అకాల వర్షాలు కురుస్తున్నాయి. ఇటీవల పలు ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ధాన్యం కొట్టుకుపోగా, తడిచిన ధాన్యం మొలకెత్తింది. మరికొద్ది రోజులు భారీ వర్షాలు ఉంటాయని వాతావరణశాఖ ప్రకటించింది. దీంతో రైతుల గుండెలో అలజడి మొదలైంది.
- (ఆంధ్రజ్యోతి, యాదాద్రి)

- ధాన్యం కొనుగోళ్లలో జాప్యం
- అకాల వర్షాలతో రైతులు సతమతం
- యాదాద్రిలో హమాలీల కొరత, రవాణా ఇబ్బందులు
- మిల్లుల్లో స్థలాభావం, పక్క జిల్లాలకు తరలింపు
- కొనుగోళ్ల వేగవంతానికి ప్రత్యేకాధికారుల నియామకం

యాదాద్రి జిల్లా వ్యాప్తంగా 90శాతానికి పైగా వరి కోతలు పూర్తయ్యాయి. ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాల్లోని కల్లాల్లో రైతులు ఆరబెట్టారు. ఓ మోస్తరుతోపాటు చిరుజల్లులతో కూడిన వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం శ్రమించి సాగుచేసిన పంట నేలపాలవుతుండటంతో రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. ధాన్యం వీలైనంత త్వరగా కొనుగోలు చేయాలని వేడుకుంటున్నారు. రైతులు వరి 2.40లక్షల ఎకరాల్లో సాగుచేశారు. సుమారు 5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుమతి అవుతుందని అధికారులు అంచనా వేశారు. అందుకు మొత్తం 323 కొనుగోలు కేంద్రాలను అధికారులు ఏర్పాటుచేశారు. కాగా, నెల రోజులుగా కొనుగోలు కేంద్రాలతోపాటు కల్లాల్లో ధాన్యం రాశులు పేరుకుపోయాయి. కొనుగోలు కేంద్రాల్లో స్థలాలు లేక వ్యవసాయ పొలాల వద్దే రైతులు ధాన్యాన్ని ఆరబెట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు పలు ప్రాంతాల్లో కల్లాల్లో ధాన్యం తడిసి ముద్దవడంతో పాటు వరదకు కొట్టుకుపోయింది. ఈ నేపథ్యంలో ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్‌తో పాటు మండల కేంద్రాల్లో రైతులు ఆందోళనలు నిర్వహించారు. వరి దిగుమతికి తగ్గట్టుగా గోదాములు లేకపోవడంతో రైస్ మిల్లర్లు చేతులెత్తేశారు. స్థలాభావంతో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం కావడంలేదు. దీంతో పక్కనున్న జనగామ,రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లోని గోదాములకు ధాన్యం తరలించేందుకు జిల్లాయంత్రాంగం సిద్ధమైంది. ఇప్పటివర కు 50వేల మెట్రిక్‌టన్నుల ధాన్యం ఇతర జిల్లాలకు తరలించారు. రైతుల ఆందోళన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ధాన్యం కొనుగోళ్లపై అప్రమత్తమైంది. సోమవారం ఒక్కరోజే 10వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని లారీల్లో ఎగుమతిచేశారు. 30లారీల్లో పక్క జిల్లాల్లోని గోదాములకు ధాన్యాన్ని తరలించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

ప్రత్యేకాధికారుల నియామకం

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం ప్రస్తుతం ఉన్న అధికారులతోపాటు అదనంగా మరో 13మందిని ప్రత్యేకాధికారులుగా ఉన్నతాధికారులు నియమించారు. జిల్లాలోని 13 మంది డిప్యూటీ తహసీల్దార్లను ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణకు నియమించారు. వీరంతా అన్ని మండలాల్లోని కొనుగోలు కేంద్రాలను పరిశీలించి, కొనుగోళ్లు వేగవంతం చేయడంతో పాటు రైతుల సమస్యలు తీర్చాలని ఆదేశాలు జారీచేశారు. కొనుగోలుకేంద్రాల్లో కాంటా పూర్తయిన ధాన్యం పేరుకుపోవడంతో లారీల్లో తరలించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. వర్షాల నేపథ్యంలో వారం రోజుల్లోగా ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేశారు.

2,64,093మెట్రిక్ టన్నుల సేకరణ

యాదాద్రి జిల్లాలో 323 కొనుగోలు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. వీటిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 192 కేం ద్రాలు, ఐకేపీ 74, ఎఫ్‌పీవో 13 కేంద్రాలు కొనసాగుతున్నాయి. మొత్తం 27,314 మంది రైతుల వద్ద 2,64,093 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. 2,54,721 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైస్ మిల్లులకు ఎగుమతి చేశారు. అందుకు మొత్తం రూ.580కోట్లకు ఇప్పటివరకు రూ.350.23కోట్ల రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. ఇంకా రూ.229.78కోట్ల మేర రైతులకు చెల్లించాల్సి ఉంది.

పేరుకు పోయిన నిల్వలు

యాదాద్రి జిల్లాలో 39 పార్‌బాయిల్డ్ రైస్ మిల్లులు ఉన్నాయి. ఈ మిల్లుల్లో యాసంగి 2022-23కి సంబంధించిన ధాన్యం సుమారు 1.80లక్షల టన్నులు, 2023-24 వానాకాలం సీజన్‌కు సంబంధించిన ధాన్యం సుమారు 1.40లక్షల టన్ను ల మేర నిల్వ ఉంది. ఈ ఏడాది యాసంగి ధాన్యాన్ని మిల్లర్లు సుమారు 2.20లక్షల టన్నుల మేర దిగుమతి చేసుకున్నారు. ప్రస్తుతం రైస్ మిల్లుల్లో సుమారు 5.40లక్షల టన్నుల ధాన్యం నిల్వ ఉంది. జిల్లాలోని 39 పార్‌బాయిల్డ్ రైస్‌మిల్లుల్లో ధాన్యం నిల్వ సామర్థ్యం సుమారు 3లక్షల టన్నులు మాత్రమే. మిగతా 2.40లక్షల టన్నుల ధాన్యాన్ని మిల్లర్లు మిల్లుల ఆవరణలో, ప్రభుత్వ, ప్రైవేట్ గోదాముల్లో నిల్వ చేశారు. మిల్లుల్లో ఇంకా 10వేల టన్ను ల ధాన్యం దిగుమతి చేసుకోవాల్సి ఉంది. అయితే మిల్లుల్లో స్థలాభావం ఉందని మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా యంత్రాంగం దృష్టికి తెచ్చింది. ఈ నేపథ్యంలో ధాన్యాన్ని నిల్వ చేసేందుకు అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. రంగారెడ్డి, జనగామ, నల్లగొండ జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ గోదాములకు తరలించేందుకు నిర్ణయించారు.

కొనుగోలు కేంద్రాల్లో ఇక్కట్లు

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తుండటంతో రైతుల గుండెల్లో దడ మొదలైంది. ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాల ని కోరుతుండగా, కొనుగోలు కేంద్రాల్లో సరిపడా హమాలీలు లేకలారీ ల్లో ధాన్యాన్ని ఎగుమతి, మిల్లుల్లో దిగుమతి చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 323 కొనుగోలు కేంద్రాలు ఉండగా, వాటికి అనుగుణంగా హమాలీలు అందుబాటులో లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 250కి పైగా లారీల్లో నిత్యం ధాన్యాన్ని మిల్లులకు ఎగుమతి చేస్తున్నారు. లారీలను కొనుగోలు కేంద్రాల నుంచి ఉదయం సమయంలో పంపిస్తే సాయంత్రం వరకు మిల్లుల్లో దిగుమతి చేయడంలేదను ఫిర్యాదులు ఉన్నాయి. రోజుకు రెండు, మూడు ట్రిప్పుల ధాన్యాన్ని మిల్లులకు తరలించాల్సి ఉండగా, కేవలం ఒక్క లోడుకే పరిమితమవుతుండటంతో రైతులు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. ప్రధానంగా జిల్లాలోని వలిగొండ, భువనగిరి, భూదాన్‌పోచంపల్లి, ఆలేరు, మోటకొండూరు, యాదగిరిగుట్ట, మోత్కురు, బీబీనగర్, తుర్కపల్లి, రాజపేట మండలాల్లో ధాన్యం తరలింపులో జాప్యం జరుగుతోంది. దీంతో ధాన్యాన్ని వరుణుడి బారినుంచి కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలుపడుతున్నారు. మరోవైపు ఏ-గ్రేడ్ రకం ధాన్యానికి బీ- గ్రేడ్ ధర చెల్లిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న ధాన్యానికి బీ-గ్రేడ్ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఏ-గ్రేడ్ ధర చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మిల్లర్లు దోపిడీ చేస్తున్నారు



ధాన్యం కొనుగోలు సమయంలో క్వింటాకు మూడు కిలోలు కోత విధిస్తున్నారు. మిల్లర్లు రైతులను దోపిడీ చేస్తున్నారు. ఆరు ఎకరాల్లో వరి సాగు చేస్తే 395బస్తాల ధాన్యం దిగుబడి వచ్చింది. 24రోజుల క్రితం ఐకేపీ కేంద్రానికి తరలించి ఆరబెట్టా. నాణ్యతా ఉన్నా, కాంటా వేశాక ఏ-గ్రేడ్‌కు బదులు బీ-గ్రేడ్ ధర చెల్లించారు. దీంతో నష్టం వాటిల్లింది.
- తుర్కపల్లి సురేందర్, రైతు, గోకారం

కొనుగోళ్లు వేగవంతం చేస్తున్నాం



రబీలో రైతులు పండించిన ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేశాం. కేంద్రాల్లో ఉన్న రైతుల మొత్తం ధాన్యం సేకరిస్తాం. రైతులు ఆందోళన చెందవద్దు. పలు ప్రాంతాల్లో రవాణా, హమాలీల సమస్య ఉన్నట్టు గుర్తించాం. ఈ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సేకరించిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు గోదాములు సమస్య ఉండటంతో పక్కనున్న జిల్లాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వారంరోజుల్లోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తాం.
- గోపీకృష్ణ, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్

మిల్లుల్లో స్థలం లేదు



ప్రభుత్వ ఆదేశాల మేరకు ధాన్యాన్ని మిల్లుల్లో దిగుమతి చేసుకుంటున్నాం. జిల్లాలోని 39 మిల్లులు ధాన్యంతో నిండాయి. రైస్‌మిల్లుల్లో ధాన్యం నిండిపోవడంతో, ప్రభుత్వ ప్రైవేట్ గోదాముల్లో నిల్వ ఉంచాం. మరో 10వేల టన్నుల వరకు ధాన్యం మిల్లులకు రావాల్సి ఉంది. ప్రస్తు తం ఏ రైస్‌మిల్లులోనూ స్థలం లేదు. దీంతో దిగుమతి చేసుకోలేకపోతున్నాం. - వెంకటేష్, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

పంటల సాగు అంచనా 21.50 లక్షల ఎకరాలు



- వరి, పత్తి పంటలకే అగ్రస్థానం
- ఇప్పటికే అందుబాటులో విత్తనాలు
- అకాల వర్షాలతో దుక్కులు సిద్ధం చేస్తున్న రైతులు
- మరో రెండు భారీ వర్షాలు వస్తేనే చల్లబడనున్న నేల
- తొందరపడి విత్తనాలు విత్తవద్దంటున్న వ్యవసాయశాఖ

గతానికి భిన్నంగా వేసవిలో అడపదడపా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. మార్చి నుంచి ఎండల తీవ్రతతో తల్లడిల్లిన ప్రజలు, మే నెలలో ఎండలను ఎలా తట్టుకుంటామని ఆందోళన చెందుతున్న సమయంలో అకాల వర్షాలు కురిశాయి. దీంతో 47 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు 39డిగ్రీల దిగువకు పడిపోయాయి. వాతావరణంలో మార్పు ప్రజలకు ఊరట ఇస్తుండగా, రైతులు ముందస్తుగా దుక్కులు దున్నుకుంటున్నారు.
- నల్లగొండ

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ నెలలో సాధారణ వర్షపాతం 695మి.మీలు కాగా, 599.9మిమీల వర్షపాతం నమోదైంది. ఇంకా 13.7శాతం వర్షపాతం లోటు ఉంది. వాస్తవానికి వేసవిలో వర్షపాతన్ని వాతావరణశాఖ లెక్కలోకి తీసుకోదు. అయితే అనూహ్యంగా వర్షాలు కురుస్తుండటంతో ఈ నెలలో లోటు వర్షపాతాన్ని లెక్కలోకి తీసుకుంది. ఇదిలా ఉండగా, వానాకాలం వ్యవసాయ సీజన్‌కు సంబంధించి ఉమ్మడి జిల్లా వ్యవసాయ అధికారులు పంటల ప్రణాళికను ఇప్పటికే రూపొందించారు. మూడు జిల్లాల్లో మొత్తం 21.50లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. సీజన్‌కు ముందే విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నైరుతి రుతుపవనాలు ముందుగానే వస్తాయని వాతావరణశాఖ పేర్కొనడంతో అందుకు అనుగుణంగా వ్యవసాయశాఖ సన్నద్ధమైంది. అయితే రైతులు ఈ సారి కూడా వరి, పత్తి సాగుకే మొగ్గు చూపుతున్నారు. సాగు అంచనా మేరకు వ్యవసాయశాఖ విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచనుంది.

రెండు భారీ వర్షాలు కురిస్తేనే విత్తాలి

వేసవి దుక్కుల్లో ముందుగానే పత్తి విత్తనాలు విత్తితే చేను ఏపుగా పెరగడంతో పాటు దిగుబడులు అధికంగా వస్తాయని రైతులు భావిస్తారు. ఈ నేపథ్యంలో పత్తి విత్తన ప్యాకెట్లను ముందుగా అందుబాటులో ఉంచాలని వ్యవసాయశాఖ భావిస్తోంది. అయితే గతంలో అనుభవాలను పరిశీలిస్తే వేసవి దుక్కుల్లో రైతులు ముందుగా విత్తనాలు వేసి వర్షాలు సకాలంలో పడక విత్తనాల కోసం పెట్టుబడి పెట్టి నష్టపోయారు. ఈ సారి మేలో వర్షాలు కురుస్తుండటంతో రానున్న రోజుల్లో మంచి వర్షాలు ఉంటాయని వాతావరణశాఖ అంచనాలు వేయగా, రైతులు వానాకాలం సీజన్‌లో పత్తి సాగును ముందుగానే చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే మరో రెండు భారీ వర్షాల తరువాతే నేల చల్లబడుతుందని, ముందుగా కురిసిన వర్షాల ఆధారంగా ఈ నెలాఖరులో తొందరపడి విత్తనాలు వేయవద్దని వ్యవసాయశాఖ హెచ్చరిస్తుంది. సాధారణంగా రైతులు రోహిణి కార్తెలో అత్యధికంగా విత్తనాలు విత్తుతారు. ప్రస్తుతం కురిసిన వర్షాలతో నేల పూర్తిస్థాయిలో చల్లబడ లేదు. పగటి ఉష్ణోగ్రతలు ఇంకా తగ్గాల్సి ఉంది. దీనిలో దృష్టిలో ఉంచుకుని, సమృద్ధిగా వర్షాలు కురిశాకే విత్తనాలు విత్తాలని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

నేల చల్లబడ్డాకే విత్తనాలు విత్తాలి



వర్షాలు సమృద్ధిగా కురిసి నేల పూర్తిస్థాయిలో చల్లబడిన తరువాతే విత్తనాలు విత్తాలి. ప్రస్తుతం కురిసిన అకాల వర్షాలతో దుక్కులు సిద్ధం చేసుకోవచ్చు. తొందరపడి విత్తనాలు విత్తితే రైతులు నష్టపోయే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని రైతులు భారీ వర్షాలు కురిశాకే విత్తనాలు విత్తితే ఉపయోగం ఉంటుంది. రైతులకు అవసరాలకు అనుగుణంగా విత్తనాలు, ఎరువులను సిద్ధంగా ఉంచాం.
- పి.శ్రవణ్ కుమార్, జేడీఏ, నల్లగొండ

21.50లక్షల ఎకరాల్లో వివిధ పంటలు

వానాకాలంలో ఉమ్మడి జిల్లాలో మొత్తం 21.50లక్షలకు ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి నివేదించింది. అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 5.40లక్షల ఎకరాల్లో పత్తి సాగు కానుండగా, అందుకు 15లక్షల విత్తన ప్యాకెట్లు అవసరం. యాదాద్రి, సూర్యాపేట జిల్లాల్లో వరి అత్యధికంగా సాగు కానుండగా, పత్తి 3లక్షల ఎకరాల్లో సాగు కానుంది. ఈ రెండు జిల్లాల్లో 9లక్షలకు పైగా పత్తి విత్తన ప్యాకెట్లను వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉంచాల్సి ఉంటుంది. వరికి విత్తనాలు 2.04లక్షల క్వింటాళ్లకు పైగా అవసరం. జిల్లాలకు చేరిన విత్తనాలను వ్యవసాయాధికారులు మండలాలకు తరలిస్తున్నారు.

పోలింగ్, కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేయాలి

ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై కలెక్టర్ దాసరి హరిచందన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నల్లగొండ టౌన్, మే 20 : వరంగల్-ఖమ్మం-నల్లగొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నిక పోలింగ్, కౌంటింగ్‌లకు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉపఎన్నిక ఏర్పాట్లపై నోడల్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 22న నల్లగొండ, సూర్యాపేట జిల్లాల పోలింగ్ సిబ్బందికి కౌంటింగ్‌పై శిక్షణ ఉంటుందని, అవసరమైతే 12 జిల్లాల్లో సైతం శిక్షణ నిర్వహించేలా చూడాలన్నారు. 24వ తేదీన పీవో, ఏపీవో, సూక్ష్మపరిశీలకులకు రెండో విడత శిక్షణ ఉంటుందని, రెండో విడత ర్యాండమైజేషన్ కూడా అదే రోజు పూర్తిచేయాలన్నారు. బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేయడం, బ్యాలెట్ పేపర్, పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు, ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రిని సిద్ధం చేసుకోవాలన్నారు.పోలింగ్ కేంద్రాల్లో ప్రథమ చికిత్స సౌకర్యాలతో పాటు, దివ్యాంగ ఓటర్లకు వాహనాలు ఏర్పాటుచేయాలని, వీల్ చైర్లు అందుబాటులో ఉంచాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కి సంబంధించి ఈ నెల 20 నుంచి 25 వరకు అవకాశం ఉందన్నారు. నల్లగొండ జిల్లాకు సంబంధించి జిల్లా కేంద్రంలోని కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చని ఆమె తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగులు, పోలీసులు, సూక్ష్మ పరిశీలకులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జే శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, ఆర్డీవో రవి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పథకాల అమలులో జిల్లాకు మెరుగైన స్థానం

జిల్లాలో ఇంటింటికీ తాగునీటి సరఫరా, పారిశుధ్యం, సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణ, ఉపాధి హామీ అమలు వంటి వాటిలో జిల్లా మెరుగైన స్థానంలో ఉందని కలెక్టర్ దాసరి హరిచందన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ అధికారుల బృందం శిక్షణ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ప్రజల సామాజిక, ఆర్థిక అంశాల అధ్యయన కోసం జిల్లాకు రాగా సోమవారం కలెక్టరేట్‌లో వారితో మాట్లాడారు. జిల్లాలో మిషన్ భగీరథ ద్వారా ప్రతీ ఇంటికి తాగునీరు అందిస్తున్నామని, పట్టణ ప్రాంతాలు మొదలుకొని, గ్రామీణ ప్రాంతాల్లో సైతం నల్లా కనెక్షన్లు ఉన్నాయని తెలిపారు. వ్యవసాయంలో భాగంగా విత్తనాల సరఫరా, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, వ్యవసాయ శాఖ ద్వారా అందించే విధానాన్ని వివరించారు. అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ల బృందం ఈ నెల 20 నుంచి 24 వరకు జిల్లాలోని ఎంపిక చేసిన గ్రామాల్లో పర్యటించనున్నారు. ఈ బృందానికి నోడల్ అధికారిగా డీఆర్‌డీవో నాగిరెడ్డి వ్యవహరించనున్నారు.

749 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు : ఎస్పీ

●5లో..





ప్రత్యేక అలంకారంలో స్వామివారు

యాదగిరీశుడి జయంత్యుత్సవాలకు శ్రీకారం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి జయంతి ఉత్సవాలు పాంచరాత్రాగమరీతిలో సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత విశ్వక్సేన ఆరాధిస్తూ స్వస్తివాచనంతో మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకలకు వేదపండితులు శ్రీకారం చుట్టారు. అనంతరం విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, లక్ష కుంకుమార్చన, అలంకార, తిరువీధి సేవ, సాయంత్రం మృత్సంగ్రహణం, అంకురార్పణ, మూలమంత్ర హవనం, గరుడ వాహన సేవ నిర్వహించారు.

●5లో..



స్వామివారికి తిరువీధి సేవ నిర్వహిస్తున్న అర్చకులు

ఎన్నికల కోడ్ ముగియగానే 'రుణమాఫీ' చేయాలి

- కోమటిరెడ్డి నిలకడలేని వ్యక్తి
- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



నల్లగొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

నల్లగొండ / నకిరేకల్, మే 20 : రాష్ట్రంలో రుణమాఫీకి ఆగస్టు 15 వరకు ఆగటం ఎందుకని జూన్ 5తో ఎన్నికల కోడ్ ఎత్తివేస్తున్నందున వెంటనే అమలు చేయాలని, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నిలకడలేని వ్యక్తి అని, అలాంటి చిల్లర వ్యక్తి గురించి మాట్లాడటం సమయం వృథా అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ను విమర్శించే ముందు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కాంగ్రెస్ పరిస్థితి ఏవిధంగా ఉందో గమనించుకోవాలని హితవు పలికారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. గతంలో నాలుగుసార్లు జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం సాధించిందని, ఈసారి కూడా బీఆర్‌ఎస్‌దే విజయమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న మోసం ప్రజలకు అర్థమైందన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మడం లేదన్నారు. కేవలం స్థానిక సంస్థల ఎన్నికల లబ్ధిపొందడం కోసమే ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తామని రైతులను మభ్యపెడుతున్నారన్నారు. బీసీ గణన చేసిన తరువాతనే స్థానిక సంస్థలను ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పిన కాంగ్రెస్ మాట మార్చిందన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం 30 వేల ఉద్యోగాలు ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆర్డర్ కాపీలు అందజేసి తామే ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు గా గొప్పలు చెప్పుకుంటోందని విమర్శించారు. సమావేశంలో నల్లగొండ జడ్పీచైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, నాయకులు చీర పంకజ్‌యాదవ్, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, కరీంపాషా, బక్క పిచ్చయ్య, బోనగిరి దేవేందర్, కంచనపల్లి రవీందర్‌రావు, వంగాల సహదేవారెడ్డి, దేప వెంకట్‌రెడ్డి, మారగోని గణేష్, మెరుగు గోపి, చిన్నపురెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా నకిరేకల్‌లో జరిగిన ఉప ఎన్నిక సన్నాహక సమావేశంలో మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, తెలంగాణ ఉద్యమ కారుడు డాక్టర్ చెరుకు సుధాకర్, రాంబాబు, నకిరేకల్ మునిసిపల్ ఛైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, జడ్పీటీసీ మాద ధనలక్ష్మి, బీఆర్‌ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు ప్రగడపు నవీన్‌రావు, యల్లపురెడ్డి సైదిరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి చెంప చెళ్లుమనిపించాలి

బీజేపీ జాతీయ కమిటీ సభ్యుడు, మాజీ మంత్రి ఈటల రాజేందర్

కోదాడ/హుజూర్‌నగర్, మే 20: హామీలు ఇచ్చి అమలుచేయని కాంగ్రెస్ పార్టీకి చెంప చెళ్ళుమనిపించేలా ఎమ్మెల్సీ ఉపఎన్నికలో బుద్ధి చెప్పాలని బీజేపీ జాతీయ కమిటీ సభ్యుడు, మాజీ మంత్రి ఈటల రాజేందర్ ఆరోపించారు. సోమవారం సూర్యాపేట జిల్లా కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించిన బీజేపీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఓటర్లు ప్రలోభాలకు లొంగవద్దని, అక్రమంగా సంపాదించిన డబ్బుతో ఓటర్లను కొనుగోలుచేసి గెలిచేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందన్నారు. మోదీ హయాంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. కాంగ్రెస్ హయాంలో అన్ని కుంభకోణాలే అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పాలనకు నక్కకు, నాకలోకానికి ఉన్న తేడా ఉందన్నారు. కాంగ్రెస్ పాలనలో జమ్ము కశ్మీర్ తమను పాకిస్థాన్‌లో కలపాలని ప్రజలు డిమాండ్ చేస్తే, బీజేపీ పాలనలో పాకిస్థాన్‌కు చెందిన కొంతమంది పౌరులు తమను భారత్‌లో కలపాలని డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 12సీట్లు గెలుస్తుందని అమిత్‌షా మాట్లాడారని, అదే నిజం కాబోతోందన్నారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు మాటలు కోటలు దాటాయే తప్ప రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమన్నారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంతో పాటు అన్నిరకాల ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన వెంటనే ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలుకావడం లేదన్నారు. దేవుళ్లపై ప్రమాణం చేసే స్థాయికి రేవంత్‌రెడ్డి దిగజారి పోయారన్నారు. సమావేశంలో జహీరాబాద్ ఎంపీ బీబీ.పాటిల్, బీజేపీ నల్లగొండ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, నాయకులు బొబ్బ భాగ్యరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ జనార్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి, కనగాల నారాయణ, భాగ్యరెడ్డి, కనగాల వెంకట్రామయ్య, నూనె సులోచన, బొలిశెట్టి కృష్ణయ్య, యాదా రమేష్, సాతులూరి హనుమంతురావు, అంజియాదవ్, కవితారెడ్డి, యశ్వంత్, వంగవీటి శ్రీనివాసరావు, వరుణ్‌రెడ్డి, చల్లా శ్రీలతారెడ్డి, అంబళ్ళ నరేష్, గుండెబోయిన వీరబాబు, బాల వెంకటేశ్వర్లు, రామరాజు, రవి, విజయ్, పాల్గొన్నారు.



సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో మాట్లాడుతున్న బీజేపీ నేత, మాజీమంత్రి ఈటల రాజేందర్



యాదాద్రి జిల్లాకు చేరిన ఏకరూప వస్త్రాలు

భువనగిరి టౌన్, మే 20 : నూతన విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే ప్రతీ ఏటా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందిస్తున్నారు. ఈ ఏడాది కూడా సకాలంలో అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. యాదాద్రిభువనగిరి జిల్లా విద్యార్థులకు అవసరమైన ఏకరూప వస్త్రాలు జిల్లాకు చేరాయి.


భువనగిరికి చేరిన ఏకరూప వస్త్రాలను గోదాంలోకి తీసుకెళ్తున్న కూలీలు

భువనగిరి బీచ్‌మహల్లా ఉన్నత పాఠశాలలోని గోదాంకు శనివారం తెల్లవారుజామున చేర్చారు. దుస్తులను అదే రోజున పాఠశాలలకు పంపిణీ చేయడం ప్రారంభించారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే జూన్ 12 నాటికి వస్త్రాలతో ఏకరూప దుస్తులు కుట్టించి విద్యార్థులకు అందజేయనున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల మహిళా సంఘాలు ఏకరూప దుస్తువులు కుట్టనున్నాయి. కాగా జిల్లాకు టెస్కో ద్వారా లక్షా 600 మీటర్ల రెండు రంగుల ఏకరూప వస్త్రాలు జిల్లాకు చేరాయి. జిల్లాలోని 673 ప్రభుత్వ, ఎయిడెడ్, కేజీబీవీ, గురుకుల పాఠశాలల్లో చదువుతున్న 51,848 మంది విద్యార్థులకు రెండు జతల ఏకరూప దుస్తులు ఇవ్వనున్నారు. అయితే తొలి దఫాగా ఇచ్చే జత ఏకరూప దుస్తువుల కోసం జిల్లాకు లక్షా 600 మీటర్ల వస్త్రాలు చేరాయి. త్వరలో రెండో దఫాగా వస్త్రాలు రానున్నాయి. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ జిల్లాలోని ఎంపిక చేసిన 541 స్వయం సహాయక సంఘాల ద్వారా దుస్తువులను కుట్టించనున్నారు. ఒక్కో జతకు కుట్టు చార్జీగా రూ.50 చెల్లిస్తారు.

నాణ్యతా ప్రమాణాలతో దుస్తులు : నారాయణరెడ్డి, డీఈవో

పాఠశాలల పునఃప్రారంభం జూన్ 12నే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తువులు అందజేస్తాం. ఈపాటికే పాఠ్య పుస్తకాలు పాఠశాలల వారీగా పంపిణీ చేశాం. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన మహిళా సంఘాలు ఏకరూప దుస్తువులు కుట్టనున్నాయి. విద్యార్థులకు సరిపడా సైజుల్లో నాణ్యతా ప్రమాణాలతో కుట్టాలని సంఘాలను ఆదేశించాం.

సకాలంలో దుస్తులు అందిస్తాం: గాయపాక శోభ, పాఠశాల కమిటీ అధ్యక్షురాలు, బోయవాడ పాఠశాల భువనగిరి.

దుస్తులను జూన్ 12వ తేదీన విద్యార్థుల అందిస్తాం. ఇప్పటికే దుస్తులను కుట్టే మహిళా సంఘాల ఎంపిక పూర్తయ్యింది. కుట్టు పనులను అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఉపాధ్యాయుల ఖాళీలను పూర్తి చేసి మౌలిక వసతులను కల్పిస్తే విద్యార్థులు గణనీయంగా చేరే అవకాశం ఉంది.















నెల్లిబండ జాతరకు తరలివచ్చిన భక్తజనం


బోనాలతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న మహిళలు

నకిరేకల్, మే 20 : నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం నెల్లిబండ గ్రామంలోని గుట్టపై ఉన్న శ్రీ లింగమంతులస్వామి సౌడమ్మ గట్టు జాతర రెండో రోజైన సోమవారం భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచే స్వామి వారి దర్శనం కోసం కాలినడకన గుట్టపైకి చేరుకుని బారులుతీరారు. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లుచేశారు. మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం ఉదయం 6 గంటలకు పూజా కార్యక్రమాలు, 7 గంటలకు కుంకుమార్చన, కంకణాధారణ, ఉదయం 8 గంటలకు బోనాలు, సాయంత్రం 5 గంటలకు ఆకుమంచమ్మ బోనం తీశారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాటు పలువురు ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ లింగమంతుల స్వామి దీవెనలతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలన్నారు. త్వరలో గుట్టపైకి రోడ్డు నిర్మాణం చేపడుతామని, ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ యానాల యాదగిరి రెడ్డి, టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు చామల శ్రీనివాస్, పన్నాల రాఘవరెడ్డి, బచ్చుపల్లి గంగాధర్‌రావు, యానాల శేఖర్‌రెడ్డి, ధర్మకర్తలు బాత్క లింగస్వామి, గుడగుంట్ల శివశంకర్, ఆడెపు సతీష్, బోయిళ్ల అశ్విని రవి, వీరబోయిన అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.


లింగమంతుల స్వామి దేవాలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం

40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

గుర్రంపోడు, మే 20: నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని తానేదారుపల్లిలో సోమవారం రాత్రి 40క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యాపారులపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ సీఐ గౌస్ తెలిపారు. మండలంలోని తానేదారుపల్లి గ్రామానికి చెందిన వ్యాపారులు గార్లపాటి శ్రీను, గార్లపాటి మల్లికార్జున రేషన్ కార్డుదారుల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరించి వ్యాపారం చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం వారి ఇళ్లపై విజిలెన్స్ సీఐ గౌస్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించగా గార్లపాటి శ్రీను వద్ద నిల్వ చేసిన 20క్వింటాళ్ల బియ్యం, గార్లపాటి మల్లికార్జున వద్ద 20క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించినట్లు తెలిపారు. వారిని విచారించగా నాంపల్లిలోని స్వామికి బియ్యాన్ని విక్రయిస్తున్నామని తెలిపినట్లు తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకుని ఆటోలో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇద్దరు వ్యాపారులతో పాటు స్వామిపై 6ఏ కేసుతో పాటు క్రిమినల్‌కేసులు నమోదు చేస్తామన్నారు. దాడుల్లో సివిల్ సప్లయి ఆర్ఐ అబీద్, కానిస్టేబుళ్లు వెంకట్‌రెడ్డి, అమీద్ పాల్గొన్నారు.

అనుమానంతో దాడి, భార్య మృతి

- స్పృహతప్పి పడిపోయిందంటూ ఆసుపత్రికి
- అప్పటికే మృతిచెందినట్లు వైద్యుల నిర్ధారణ


జ్యోతి(ఫైల్)

తిప్పర్తి, మే 20 : నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలో అనుమానంతో భర్త చేసిన దాడిలో భార్య హతమైంది. ఎస్ఐ డీ రాజు తెలిపిన వివరాల ప్రకారం తిప్పర్తి గ్రామపంచాయతీ నూకలవారిగూడెం గ్రామానికి చెందిన గుండెబోయిన నాగరాజుకు గుర్రంపోడు మండలం కొప్పోలు గ్రామానికి చెందిన జ్యోతి(40)తో 2001లో వివాహమైంది. వృత్తిరీత్యా వ్యవసాయం చేసే ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కొన్నినెలలుగా మద్యానికి బానిసైన నాగరాజు భార్యపై అనుమానం పెంచుకున్నాడు. ఇదే విషయమై వీరి మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం మధ్యాహ్నం జ్యోతి తమకు ఉన్న గేదెలను మేపేందుకు తీసుకుని ఊరు చివరికి వెళ్లింది. అనుమానంతో వెనుకే వెళ్లిన నాగరాజు అక్కడ భార్యతో గొడవకు దిగి కోపంతో భార్యపై కర్రతో విచక్షణ రహితంగా కొట్టడంతో స్పృహతప్పి పడిపోయింది. అనంతరం ఆమెను ఇంటికి తీసుకొచ్చి స్పృహతప్పి కింద పడిపోయిందని చుట్టపక్కల వారికి చెప్పి అంబులెన్స్‌లో నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. అయితే ఆసుపత్రికి తరలించేలోగానే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. శరీరంపై, తలపై గాయాలు కమిలి ఉండడం గమనించిన మృతురాలి తండ్రి భైరవోని స్వామి ఆదివారం అర్ధరాత్రి తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. సోమవారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని వారి కుటుంబసభ్యులకు అప్పగించగా, అంత్యక్రియలు నిర్వహించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుడు నాగరాజు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

ఇసుక తరలిస్తున్న ఇసుక టిప్పర్ పట్టివేత

ఆత్మకూరు(ఎం) మే20: ఇసుక అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను యువకులు పట్టుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామ యువకులు తిలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కొరటికల్ గ్రామంలోని బిక్కేరు వాగుపై నూతనంగా నిర్మిస్తున్న చెక్‌డ్యామ్ గుంతలలో తీయగా వచ్చిన ఇసుకను కొన్ని రోజులుగా అర్ధరాత్రి టిప్పర్ల సహాయంతో ఇతర ప్రాంతాలకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న గ్రామనికి చెందిన శివాజీ యువజన సంఘం యువకులు ఆదివారం అర్ధరాత్రి స్థానిక శివాలయం వద్ద ఇసుక టిప్పర్‌ను పట్టుకుని డ్రైవర్‌ని విచారించగా అతని వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఇసుక టిప్పరును సోమవారం విడిచి పెట్టడడంతో గ్రామ యువకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఎస్ఐ డి. నాగరాజును వివరణ కోరగా తహసీల్దార్ కార్యాలయం నుంచి అనుమతి పొందినట్లు ఆయన తెలిపారు.

యాదగిరీశుడి జయంత్యుత్సవాలకు శ్రీకారం



తిరుమాడ వీధుల్లో విహరిస్తున్న స్వామివారు

భువనగిరి అర్బన్, మే 20: యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామివారి జయంతి ఉత్సవాలు పాంచారాత్రాగమన రీతిలో వైశాఖ శుద్ధ ద్వాదశిన సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలత విశ్వక్సేన ఆరాధిస్తూ స్వస్తివాచనంతో మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకలకు శ్రీకారం చుట్టారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలు ఆలయ ప్రధానార్చకుడు నల్లందీగల్ లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగాయి. 10గంటలకు లక్ష కుంకుమార్చన నిర్వహించి, 11గంటలకు తిరువేంకటాపతిగా అలంకార సేవ తిరువీధుల్లో ఊరేగించారు. సాయంత్రం ఆరు గంటలకు మృత్స్యంగ్రహణం, అంకురార్పణ, మూలమంత్ర హవనం, రాత్రి ఎనిమిది గంటలకు గరుడ వాహనంపై పరమవాసుదేవ అలంకార సేవలు నిత్యారాధనల అనంతరం అలంకార సేవలు తిరువీధుల్లో ఊరేగింపుతో జయంత్యుత్సవాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఉప ప్రధానార్చకుడు, అర్చకులు, వేద పండితులు, పారాయణీకులు వైభవంగా మాడవీధుల్లో ఊరేగించగా ఈవో ఏ. భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఆలయ ఏఈవో దూశెట్టి క్రిష్ణ, సూపరింటెండెంట్ రామారావు పాల్గొన్నారు. అదేవిధంగా పాతగుట్ట ఆలయంలో ఉత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

స్వామివారి ఉత్సవాలను పురస్కరించుకొని కొండపైన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం యాదగిరిగుట్ట శ్రీవీరప్రతాప భజన మండలి, శ్రీభాగ్యలక్ష్మీ మహిళా భజన మండలిచే భజన కార్యక్రమాలు సాయంత్రం తోరణాల పద్మజ బృందం, మంద శ్రీనివాస్ బృందంచే భక్తి సంగీతం, కనకదుర్గ నృత్య విభావరి భరతనాట్యం, యుక్తారెడ్డి బృందం, ప్రణుతి ఆదర్శిని బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. స్వామివారి జయంత్యుత్సవాల్లో భాగంగా కొండపైన ప్రధాన కార్యాలయం వద్ద లంగ్‌కేర్ సెంటర్ డాక్టర్ రవీంద్ర, స్కిన్, హెయిర్ క్లినిక్ డాక్టర్ ఎస్. దీప ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ నెల 28న స్వామివారి హుండీ కానుకలు లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు.

యాదగిరికొండపై హరిహరులకు పూజలు

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామివారి కొండపై హరిహరులకు సోమవారం విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామిఅమ్మవారికి వైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, అనుబంధం ఆలయంగా కొనసాగుతున్న పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామివారికి శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమశాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవార్లను మేల్కొల్పిన అర్చకస్వాములు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించారు. పూజారులు విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం వేళ అలంకార వెండీ జోడు సేవలు, సహస్ర నామార్చనలు ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖ మండపంలో స్ఫటికమూర్తును అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళ వాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సమూర్తులకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. భక్తుల రద్దీ సాధారణంగా ఉందని అధికారులు తెలిపారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.56,27,107 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి : స్పీకర్

రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆకాంక్షించారు. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి వారిని సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేయగా వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం ఆలయ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. యాదగిరిగుట్ట పురాతన చరిత్ర కలిగిన ఆలయమని, తెలంగాణలో గొప్ప దేవాలయం అని కీర్తించారు. రాష్ట్రంలో వర్షాభావం చేత తీవ్ర కరువుఛాయలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో పాలన సాగిస్తున్న సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి మరింత మనోధైర్యాన్ని స్వామివారి ఆశీస్సులతో పొంది రాష్ట్ర ప్రజానికానికి సంక్షేమ ఫలాలు అందించేందుకు కృషి చేయాలన్నారు. స్పీకర్ హోదాలో తనకు యాదగిరిగుట్ట స్వామివారిని దర్శించుకునే భాగ్యం కలిగిందన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో ఏమీ మిగలకుండా చేసినందున, ఈ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకునే ఆత్మస్థైర్యాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో జనరంజక పాలన కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు.

సంగీత వేదిక ఎదుట దేవతామూర్తులు



యాదగిరిగుట్ట దివ్యక్షేత్రంలో సంగీత సభల నిర్వహణకు ప్రత్యేకంగా వేదికను ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ తూర్పు దిశ ఈశాన్యంలో ఈ వేదిక ముందు గరుత్మంతుడు, ఆంజనేయస్వామి ఫైబర్ విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. కాగా, నిత్యం జరిగే కైంకర్యాల వివరాలు తెలిపేందుకు ఎల్‌సీడీ స్క్రీన్ల ఏర్పాటుకు బ్రహ్మోత్సవ మండపం సమీపంలో సిద్ధం చేస్తున్నారు. స్వయంభూ ఆలయ విశిష్టతను తెలిపేందుకు క్యూఆర్ కోడ్‌ను కూడా అందుబాటులోకి తేనున్నారు. స్క్రీన్‌పై డిస్‌ప్లే ద్వారా భక్తులకు మరింత సమాచారం అందించేందుకు ఆలయ అధికారులు ఈ ఏర్పాట్లు చేస్తున్నారు.



ఆలయ ఆవరణలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్



ఆలయంలో వేదపారాయణలు చేస్తున్న అర్చకులు



స్వయంభూవులకు కంకణధారణ చేసేందుకు వెళ్తున్న ఈవో, ప్రధానార్చకులు



సేద తీరుతున్న భక్తులు

తూనికలు, కొలతల శాఖ అధికారుల తనిఖీలు



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

దేవరకొండ, కొండమల్లేపల్లి, మే 20: నల్లగొండ జిల్లా తూనికల కొలతలశాఖ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో దేవరకొండ, కొండమల్లేపల్లిలోని పలు దుకాణాల్లో సోమవారం తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించిన ఐరన్, హార్డ్‌వేర్, సిమెంట్ వ్యాపారులపై 12 కేసులు నమోదు చేసినట్లు రామకృష్ణ తెలిపారు. పెట్రోల్‌బంక్‌లు, ఎరువుల దుకాణాలు, సిమెంట్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. తూనికల కొలతల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారులు నిబంధనలు పాటించి విక్రయాలు నిర్వహించాలని ఆయన సూచించారు.

గేదెను ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి



నాగరాజు(ఫైల్)

గరిడేపల్లి, మే 20: ద్విచక్ర వాహనం గేదెను ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం రాయినిగూడెం గ్రామ శివారులో జరిగింది. ఎస్ఐ ఈట సైదులు తెలిపిన వివరాల ప్రకారం... మండలపరిధిలోని మంగాపురం గ్రామానికి చెందిన పేర బోయిన నాగరాజు(40) పని నిమిత్తం బైక్‌పై ఆదివారం ఉదయం హుజూర్‌నగర్‌కు వెళ్లాడు. పని ముగించుకొని తిరిగి రాత్రి 11గంటల సమయంలో తిరిగి మంగాపురానికి వస్తుండగా కోదాడ, మిర్యాలగూడ ప్రధాన రహదారిపై చీకటిగా ఉండడంతో గేదె అడ్డంగా రావడంతో ఢీకొట్టాడు. దీంతో నాగరాజు తలకు, ఛాతికి బలమైన గాయాలు కావ డంతో స్థానికులు 108అంబులెన్స్‌లో హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలిం చారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మంలోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని మరో ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. మరో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. నాగరాజు భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. నాగరాజుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

మనస్తాపంతో వృద్ధుడు ఆత్మహత్య

కనగల్, మే 20: అనారోగ్యంతో మనస్తాపం చెందిన వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని జీఎడవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని లింగాలగూడెంలో జరిగింది. కుటుంబసభ్యులు, ఎస్ఐ రామక్రిష్ణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మెండు రాంచంద్రారెడ్డి(85) కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. కడుపు నొప్పితో బాధపడుతూ ఎన్ని మందులు వాడినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. రాంచంద్రారెడ్డి కుమారుడు నర్సిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భజనమందిర ప్రహరీ కూల్చివేతపై ఫిర్యాదు

చిట్యాలరూరల్, మే 20: నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లిలో భజన మందిరానికి సంబంధించిన ప్రహరీని ఆదివారం రాత్రి లారీతో ఢీకొట్టి కూల్చివేతపై భక్తులు ఫిర్యాదు చేశారు. గ్రామస్థులు ఆధ్యాత్మిక చింతనతో భజన కార్యక్రమాలను చేపట్టేందుకు 24ఏళ్ల క్రితం గ్రామానికి చెందిన రావుల బీరప్ప తనకున్న భూమిలో భజన బృందం మందిర నిర్వాహణకు విరాళంగా ఇచ్చారు. ఆ స్థలంలో గ్రామస్థులు చందాలు వేసుకుని మందిరాన్ని, ప్రహరీ నిర్మించుకుని అప్పటి నుంచి భజన కార్యక్రమాలు చేసుకుంటున్నారు. భజన మందిరానికి స్థలాన్ని విరాళమిచ్చిన బీరప్ప కుటుంబ సభ్యుడు ఏడాది క్రితం నుండి తమ స్థలాన్ని తమకు తిరిగి ఇవ్వాలని భజన బృందం సభ్యులకు ఖరాకండిగా చెప్పడంతో విరాళంగా ఇచ్చిన భూమిలో మందిరాన్ని నిర్మించుకున్నామని తిరిగి అడగడం భావ్యం కాదని చెప్పారు. తమ స్థలాన్ని ఇవ్వకపోవడంతో బీరప్ప కుటుంబ సభ్యుడు ఆదివారం రాత్రి లారీతో భజనమందిరం ప్రహరీని లారీతో కూల్చివేశాడని భక్త బృందం, గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మందిరానికి సంబంధించిన ప్రహరీని కూల్చివేయడం భావ్యం కాదని ఆందోళన చెందారు. ప్రహరీని కూల్చివేతపై చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఇరు వర్గాల నడుమ వాగ్వాదం జరగడంతో సుమారు ఏడాది క్రితం న్యాయస్థానంలో కేసు వేసుకున్నట్లుగా తెలిసింది. దీనిపై చిట్యాల ఎస్ఐ సైదాబాబును వివరణ కోరగా సంఘటనా స్థలాన్ని పరిశీలించామని, వివరాలు తెలుసుకోగా మందిరం స్థలం అంశం న్యాయస్థానంలో ఉందని తెలిపారు.



భజన మందిరం ప్రహరీని పరిశీలిస్తున్న గ్రామస్తులు

కొనసాగుతున్న అధ్యయనోత్సవాలు



ఆలయ తీరు వీధుల్లో గ్రామోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

మఠంపల్లి, మే 20: సూర్యాపేట జిల్లాలోని మట్టపల్లి ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మట్టపల్లి లక్ష్మీనరసింహుడి ఆలయంలో నిర్వహిస్తోన్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా చేపట్టిన అధ్యయనోత్సవాలు కొనసాగుతున్నాయి. మూడో రోజు సోమవారం మూలవర్లకు ప్రాతఃకాలార్చనలు, అభిషేకాలు పూర్తయ్యాక శ్రీమహావిష్ణువుకు పరమభక్తులైన నమ్మాళ్వారులకు తిరుమంజనం చేపట్టారు. పట్టువస్త్రాలు, తులసీ మాలలతో అలంకరించి భద్రపీఠంపై ఉంచి పరమపదోత్సవం నిర్వహించారు. నమ్మాళ్వారు 34 సంవత్సరాల ప్రాయంలోనే వైకుంఠానికి చేరి దేవతలు, మునీశ్వరుల కోరిక మేరకు భూవిపైకి అర్చనామూర్తిగా వేంచేసిన అద్భుత ఘట్టాన్ని రుత్విక్కులు నేత్రపరంగా ఆవిష్కరించారు. ఆళ్వారుల పునరావతార అంశాలను భక్తులకు విశదపరిచారు. రాత్రి ఆళ్వారులు సహా ఉత్సవ మూర్తులను గరుడవాహనంపై అధిష్ఠింపజేసి తీరువీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ స్వామి సేవలో అద్యంతం నృసింహ నామ స్మరణతో భక్తులు పరశులయ్యారు. ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లి, విజయ్‌కుమార్, ఈవో నవీన్ పాల్గొన్నారు.

ఎప్‌సెట్‌లో రాణించలేదని విద్యార్థి ఆత్మహత్య



కనగల్, మే 20: ఎప్‌సెట్‌లో సరైన ర్యాంకు రాలేదని నల్లగొండ జిల్లా కనగల్‌లో ఓ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. కనగల్ ఎస్ఐ రామకృష్ణగౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కనగల్ మండల కేంద్రానికి చెందిన నర్సింగ్ సత్తయ్య, కృష్ణవేణి దంపతుల పెద్ద కుమారుడు నితిన్‌గౌడ్(18) నల్లగొండలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియెట్ పూర్తిచేశాడు. ఈ నెల 18వ తేదీన విడుదల చేసిన ఎప్‌సెట్ ఫలితాల్లో సరైన ర్యాంకు రాలేదని తీవ్ర మనోవేదనతో ఉన్నాడు. ఆదివారం రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రించిన తర్వాత బెడ్‌రూంలో ఉరేసుకున్నాడు. సోమవారం ఉదయం 6 గంటలకు నితిన్‌ను కుటుంబ సభ్యులు గమనించే సమయానికి మృతి చెందాడు. అనంతరం పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి చేరుకుని వారు వివరాలు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. తండ్రి సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

వలిగొండ, మే 20: ప్రేమ పేరుతో బాలికను వేధింపులకు గురి చేసిన యువకుడిని సోమవారం పోలీసులు జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం... యాదాద్రిభువనగిరి జిల్లా మండలకేంద్రానికి చెందిన పోలెపాక విష్ణు వృత్తిరీత్యా ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేసి నిందితుడిని అరెస్ట్ చేసి జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

అమ్మ రైస్‌మిల్లులో 749 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు : ఎస్పీ



నల్లగొండలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ చందన దీప్తి

నల్లగొండ/నల్లగొండ టౌన్, మే 20: ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తూ పేద ప్రజలకు అందకుండా పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నల్లగొండ జిల్లా ఎస్పీ చందన దీప్తి హెచ్చరించారు. జిల్లాలోని పెద్దవూర మండలం తెప్పలమడుగు స్టేజీవద్ద ఉన్న అమ్మ రైస్‌మిల్లులో 749బస్తాల రేషన్ బియ్యం పట్టుబడిన నేపథ్యంలో ఎనిమిదిమంది నిందితులపై కేసు నమోదు చేశామని తెలిపారు. నిందితుల్లో అమ్మ రైస్‌మిల్లు యజమాని మల్లిరెడ్డి రామాంజిరెడ్డి, హాలియా పట్టణానికి చెందిన బూర్గు శ్రీనివాసులుతో పాటు కుక్కడపు రమేష్, పేర్ల శ్రీకాంత్, లింగాల మల్లేష్, వెంపటి సంతోష్‌కుమార్, లింగంపల్లి సైదులు, ఎడ్ల ఆంజనేయులు ఉన్నారని తెలిపారు. జిల్లాలోని పలు రైస్‌మిల్లులు రేషన్ బియ్యాన్ని ప్రభుత్వ గోదాం నుంచి నేరుగా మిల్లులకు అక్రమంగా దారి మళ్లించి లబ్ధి పొందుతున్నారన్నారు. బియ్యం అక్రమ రవాణా చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని స్పష్టంచేశారు. అమ్మ రైస్‌మిల్లులో బియ్యం అక్రమ నిల్వలు ఉన్నాయని తెలియడంతో టాస్క్‌ఫోర్స్ బృందంతో పాటు పెద్దవూర పోలీస్‌స్టేషన్ సిబ్బంది తనిఖీ నిర్వహించి బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అమ్మ రైస్‌మిల్లు యజమానితో పాటు ఇతర నిందితులపై వివిధ యాక్టుల కింద కేసు నమోదు చేశామన్నారు. రైతులు పండించిన ధాన్యం ఐకేపీ సెంటర్ల ద్వారా ప్రభుత్వం గుర్తింపు పొందిన మిల్లులకు సరఫరా జరుగుతాయన్నారు. ఆ ధాన్యాన్ని బియ్యంగా మార్చి గోదాములోకి తరలిస్తారన్నారు. గోదాముల నుంచి రేషన్ డీలర్లకు సరఫరా అయిన తర్వాత కొందరు డీలర్లు లబ్ధిదారులకు బియ్యం ఇవ్వకుండా డబ్బులు, ఇతర వస్తువులు ఇస్తూ బియ్యాన్ని ఉంచుకుంటున్నారని తెలిపారు.

అక్రమాలకు పాల్పడిందిలా..

రైతులు పండించిన ధాన్యం ఐకేపీ సెంటర్ ద్వారా ప్రభుత్వ గుర్తింపు పొందిన రైస్‌మిల్లులకు సరఫరా అవుతాయి. ఆ ధాన్యాన్ని బియ్యంగా పట్టించి వేర్‌హౌస్ కార్పొరేషన్ స్టేజ్-1 గోడౌన్‌లోకి సరఫరా చేస్తారు. వేర్‌హౌస్ కార్పొరేషన్ గోడౌన్ నుంచి మండల్ లెవల్ స్టాక్ పాయింట్‌కు పంపి అక్కడి నుంచి గ్రామాల్లో రేషన్ డీలర్లకు సరఫరా చేస్తారు. సరఫరా చేసే లారీలకు ట్రక్ చిట్స్, జీపీఎస్ అమరుస్తారు. డీలర్ షాప్ నుంచి లబ్ధిదారులు తీసుకోవాల్సి ఉంటుంది. కాని కొందరు డీలర్లు లబ్ధిదారులకు బియ్యం ఇవ్వకుండా, డబ్బులు ఇచ్చి, వేరే ఇతర వస్తువుల మార్పిడి పద్ధతి ద్వారా ఇచ్చి బియ్యాన్ని డీలర్ల వద్దనే ఉంచుకుంటారు. ఆ బియ్యాన్ని డీలర్లు మండలస్థాయి స్టాక్ పాయింట్ వద్ద నుంచి ప్రతి నెలా రావల్సిన స్టాక్‌ను తీసుకోకుండా డీలర్లు డబ్బు రూపంలో తీసుకుంటున్నారు. మండల స్థాయి స్టాక్ పాయింట్ వారు కూడా వేర్ హౌస్ కార్పొరేషన్ గోడౌన్ నుంచి స్టాక్‌ను సరఫరా చేసుకోకుండా డబ్బులు తీసుకుంటారు. ఈ బియ్యం వేర్ హౌస్ కార్పొరేషన్ గోడౌన్లో పని చేస్తున్న కొందరు అక్రమార్కులు రైస్ మిల్లర్స్‌తో కుమ్మక్కై ప్రభుత్వ గోదాం నుంచి నేరుగా ఇతర మిల్లులకు తరలిస్తున్నారు. వాటిని మిల్లర్లు వేరే బ్యాగుల్లో నింపి తిరిగి అవే బియాన్ని ప్రభుత్వానికి సీఎంఆర్ రైస్ సరఫరా చేస్తున్నారు. అంతే కాకుండా రాష్ట్రాల ద్వారా ఇతర దేశాలకు మరియు ఇతర పానియాల తయారీకి పక్కదారి పట్టిస్తున్నారు.

భూసారం తగ్గుతోంది

- తగ్గుతున్న పంట దిగుబడులు
- పెరిగిన రసాయన ఎరువుల వాడకం
- వేసవి దుక్కులు, పచ్చిరొట్ట ఎరువుతో ప్రయోజనం



మోత్కూరు, మే 20: పూర్వ కాలంలో ప్రతి రైతు పశువులను (అరక పశువులు, పాడిగేదెలు) పెంచేవారు. ఏడాదంతా నిల్వ చేసిన పశువుల పెంటను వేసవిలో ఎడ్లబండ్లతో పొలాలు, చెల్కల్లో పోసేవారు. చెరువులు, కుంటల్లో నుంచి ఒండ్రు మట్టి తీసుకెళ్లి పోసేవారు. అప్పుడు రసాయన ఎరువుల వాడకం ఉండేది కాదు.ఎవరైనా వాడినా ఎకరాకు ఒక బస్తా ఎరువు వేసేవారు. పొలాలు దున్నిన తర్వాత కానుగు, తక్కేడు తదితర ఆకులు తెచ్చి బురదలో తొక్కి దున్నేవారు. దీంతో పంట దిగుబడులు బాగా ఉండేవి.అలా పండించిన పంటలు తిని మనుషులు కూడా ఆరోగ్యంగా ఉండేవారు. ఇప్పుడు ఆ వ్యవసాయం వెతికినా కనిపించడం లేదు. సేంద్రియ, గోఆధారిత వ్యవసాయం చేయాలని శాస్త్రవేత్తలు, ప్రకృతి పరిరక్షకులు అవగాహన సదస్సులు నిర్వహించి చెబుతున్నా రైతులు ఆ దిశగా దృష్టి సారించడం లేదు.దీంతో నానాటికీ భూసారం తగ్గి, పంట దిగుబడులు కూడా తగ్గి రైతులు ఆర్థికంగా చితికి పోతున్నారు. భూసారం పెంచడానికి వ్యవసాయ శాస్త్రవేత్తలు పలు సూచనలు చేస్తున్నారు.

వేసవి దుక్కులతో మేలు

వానాకాలం సాగుకు ముందు 15నుంచి నెల రోజుల ముందు వేసవిలో కురిసే అకాల వర్షాలకు దుక్కులు దున్నాలి. భూమి వాలుకు అడ్డంగా లోతుగా దుక్కి దున్నాలి. ఇలా దున్నితే వర్షాలు కురియగానే నీరు భూమికి ఇంకుతుంది. భూమి కోతకు గురికాకుండా ఉంటుంది. దుక్కులు దున్నడంతో భూమి పై పొరలు కిందకు కింది పొరలు పైకి వచ్చి భూమి సారవంతమవుతుంది. భూమిలో తేమ శాతం కూడా పెరుగుతుంది. పంటలకు హాని చేసే పురుగులు చనిపోతాయి. కొంత మేర కలుపు మొక్కల నివారణ కూడా జరుగుతుంది. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు మోత్కూరుతో పలు మండలాల్లో రైతులు ముమ్మరంగా దుక్కులు దున్నుతున్నారు.

తగ్గిన పశువుల పెంట, చెరువు మట్టి వాడకం

వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడంతో రైతులు పశువులను పెంచడం లేదు. దీంతో పశువుల పెంట లేకుండాపోయింది. పశువుల పెంట దొరకనప్పుడు రైతులు చెరువు మట్టి పోసేవారు. మిషన్ కాకతీయ పేరుతో చెరువుల్లో పూడికలు తీయడంతో ఇప్పుడు చెరువుల్లోనూ ఒండ్రు మట్టి లభించడం లేదు. రైతులవి చిన్న కమతాలు కావడంతో ఉన్న కొద్దిపాటి భూమిని ప్రతి ఏటా దున్నడం, రసాయన ఎరువులు వేయడం తప్ప సేంద్రియ ఎరువులు వాడక పోవడంతో భూసారం దెబ్బతింటున్నది. ఏడాది ఏడాదికి పంట దిగుబడి తగ్గుతోంది. పొలాలు, చెల్కల్లో గొర్రెల మంద పెట్టించాలన్నా గొర్రెల పెంపకందారులు సాయంత్రం కాకుండానే వాటిని దొడ్లలో తోలి ఇంటి కెళ్లి పోతున్నారు. కాపలా ఉండాల్సి వస్తుందని గతంలో లాగా మందలు పెట్టడం లేదు.

సేంద్రియ ఎరువులు వాడాలి



సేంద్రియ ఎరువులు వాడకుండా రసాయ ఎరువులు మాత్రమే వాడటం వల్ల భూమిలో సూక్ష్మజీవులు నశించిపోతున్నాయి. గతంలో రసాయన ఎరువులు వంద శాతం మొక్కలకు అందేవి. ఏళ్ల తరబడి రసాయన ఎరువులు వాడడంతో ఇప్పుడు వేస్తున్న రసాయన ఎరువుల్లో 30శాతం మాత్రమే మొక్కలకు అందుతున్నాయి. ప్రతి రైతు ప్రతి ఏడు పశువుల పెంట పోయాలి. లేదా పచ్చి రొట్ట ఎరువు వేయాలి. అప్పుడే భూసారం పెరుగుతుంది. జీలుగ, జనుము తదితర పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలపై ప్రభుత్వం 66శాతం సబ్సిడీ ఇస్తుంది.

● వెంకటేశ్వర్‌రావు, ఏడీఏ, ఆలేరు

పచ్చిరొట్ట ఎరువులతో ప్రయోజనం

పశువుల పెంట, చెరువు మట్టి దొరకనప్పుడు పచ్చిరొట్ట ఎరువులు పంటలకు ఎంతో మేలు చేస్తాయి. తక్కువ ఖర్చుతో భూమికి ఎక్కువ పోషకాలు అందుతాయి. జనుము, జీలుగ, పెసర, పిల్లిపెసర, అలసంద పైర్లను సాగు చేసి మొగ్గ, పూత దశకు రాగానే భూమిలో కలియదున్నాలి. భూమిలో కలియదున్నిన తర్వాత ఇవి త్వరగానే చివుకుతాయి. పచ్చిరొట్ట ఎరువులు నేలకు సేంద్రియ పదార్థంతో పాటు నత్రజనిని కూడా అంది స్తాయి. ప్రభుత్వం అప్పుడప్పుడు జీలుగ, జనుము, పిలిపెసర విత్తనాలను సబ్సిడీపై కూడా అందిస్తుంది. రైతులు పచ్చిరొట్ట ఎరువులు సాగు చేయడం, పంట మార్పిడి చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించా లని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.



ప్రతీ ఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకోవాలి

● ఎమ్మెల్యే వీరేశం



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం

కట్టంగూరు, మే 20: ప్రతీ ఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని అయిటిపాముల గ్రామపంచాయతీ పరిధిలోని రసూల్‌గూడెం గ్రామంలో యాదవుల ఆరాధ్య దైవమైన గంగమ్మ తల్లి పండుగ వేడుకల్లో సోమవారం ఆయన పాల్గొని మాట్లాడారు. దేవాలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దైవభక్తితో గ్రామాల్లో ప్రశాంతమైన వాతావరణం నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జెల్లా ముత్తిలింగం, నాయకులు పెద్ది సుక్కయ్య, మాజీ సర్పంచ్ బెజవాడ సరోజసైదులు, ఉపసర్పంచ్ ముత్యాల లింగయ్య, బొజ్జ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భాస్కర్‌రావు చెరువుకు హద్దులు ఏర్పాటు చేయాలి

● మత్స్యపారిశ్రామిక సంఘం లిమిటెడ్ అధ్యక్షుడు సైదయ్య



ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సైదయ్య

మిర్యాలగూడ, మే 20: అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని భాస్కర్‌రావు చెరువును పూర్తి స్థాయిలో సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని అడవిదేవులపల్లి మత్స్యపారిశ్రామిక సంఘం లిమిటెడ్ అధ్యక్షుడు చెన్నబోయిన సైదయ్య కోరారు. ఈ మేరకు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సైదయ్య మాట్లాడుతూ 59 సర్వేనెం.లో 95.28 ఎకరాలు పట్టాభూమి, 41 ఎకరాలు శిఖం భూమి మొత్తం 136.25 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన భాస్కర్‌రావు చెరువు కొంతకాలంగా మూడు వైపులా ఆక్రమణకు గురవుతుందని అన్నారు. ఇప్పటికే సుమారు 16 ఎకరాలకు పైగా కబ్జాదారుల ఆక్రమణలోకి వెళ్లిందన్నారు. మత్స్యకార్మిక సంఘం సభ్యులం భూఆక్రమణల అడ్డుకున్న సందర్భంలో ఘర్షణలకు పాల్పడుతున్నారని అన్నారు. మత్సకార సంఘంలో 88 మంది సభ్యులు ఉన్నారని వీరంతా చేపలు పట్టి విక్రయించడమే జీవనోపాధిగా కొనసాగుతున్నారని అన్నారు. చెరువు విస్తీర్ణం తగ్గడం వల్ల చేపల సంరక్షణ, వృద్ధి కుంటుపడుతోందన్నారు. దీనివల్ల మత్స్యకార కుటుంబాలు ఉపాధి కోల్పోయి వీధినపడాల్సి వస్తుందని వాపోయారు. కార్యక్రమంలో అడవిదేవులపల్లి మత్సపారిశ్రామిక సంఘం లిమిటెడ్ సభ్యులు చెవిటి సైదయ్య పాల్గొన్నారు.

పెరుగుతున్న ధరల మేరకు కూలి పెంచాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న లూర్దు మారయ్య

కేతేపల్లి, మే 20: పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా ఉపాధి హామీ కూలి రూ. 600లకు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చింతపల్లి లూర్దు మారయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఉపాధి పని ప్రదేశంలో సోమవారం ఆయన కూలీలను కలిశారు. పని ప్రదేశంలో కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీని సవరించాలని అన్నారు. కేంద్రప్రభుత్వం పదేళ్లలో ఉపాధి హామీ పథకానికి నిధులు కుదించి పథకాన్ని నీరుగార్చే యత్నాలు చేసిందని విమర్శించారు. ఆయన వెంట సంఘం మండల కార్యదర్శి సీహెచ్.నాగయ్య, నాయకులు సొడయ్య, జె.వెంకన్న, లింగయ్య, సొడమ్మ, ఎం.బాలయ్య, మల్లయ్య ఉన్నారు.

తీన్మార్ మల్లన్న గెలుపు కోసం కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గుమ్ముల మోహన్‌రెడ్డి

నల్లగొండటౌన్, నల్లగొండరూరల్, మే 20: పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు కోసం ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంత్రి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు తీన్మార్ మల్లన్న గెలిపించుకునే బాధ్యత మనదేనని అన్నారు. ప్రతీ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఓటున్న ప్రతి గ్రాడ్యుయేట్ వద్దకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేసే విధంగా చూడాలన్నారు. నల్లగొండ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రతీ బూత్‌లో ప్రచారం చేపట్టాలన్నారు. గ్రాడ్యుయేట్ ఓటర్లంతా ప్రశ్నించే గొంతు తీన్మార్ మల్లన్నను గెలిపించాలని వారు కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అనేక అక్రమాలను ప్రశ్నించిన వ్యక్తికి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో అభ్యర్థిగా నిలబెట్టిందని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీ శ్రేణులు నిర్లక్ష్యం వహించకుండా పనిచేయాలన్నారు. సమావేశంలో వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, ఎంపీపీ మనిమద్దె సుమన్, కనగల్ జడ్పీటీసీ చిట్ల వెంకటేశం, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, పీఏసీఎస్ చైర్మన్ ఆలకుంట్ల నాగరత్నంరాజు, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు డాక్టర్ ఏఏ ఖాన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జూలకంటి వెంకట్‌రెడ్డి, తీన్మార్ మల్లన్న టీం ఇన్‌చార్జి కొప్పు ప్రవీణ్, నాయకులు ఉప్పునూతల వెంకన్నయాదవ్, గుండెబోయిన వెంకన్నయాదవ్, జూలకంటి సైదిరెడ్డి, పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వేడుకకో మొక్క నాటుదాం



మిత్రులతో కలిసి విత్తనాలు సేకరిస్తున్న సందీప్‌కుమార్

» అవగాహన కల్పిస్తున్న పట్టణ వాసులు
» లక్ష్యంగా లక్ష విత్తనాల సేకరణ
» మొక్కంటే ప్రాణం.. చెట్లంటే మక్కువ..

నెట్టింట రీల్స్‌తో కాలక్షేపం చేసే యువకులకు వీరు ఆదర్శంగా నిలుస్తున్నారు.

నేటి మొక్కలే రేపటి చెట్లు.. మానవాళి మనుగడకు ఉపయోగపడే ఆక్సిజన్ అందించే చెట్ల పెంపకంపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వాలతో పాటు స్వచ్ఛంద సంస్థలు పనిచేస్తుండగా పట్టణానికి చెందిన పర్యావరణ ప్రేమికులు మేము సైతం అంటూ మొక్కలకు ప్రాణం, ప్రకృతికి సాయం చేసేందుకు ముందుకొస్తున్నారు.

-(మిర్యాలగూడ టౌన్)

పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిది. పెరుగుతున్న భూతాపానికి కారణం పచ్చదనం లోపించడమే. అయితే అందుకు బాధ్యులం మనమే. అందుకు మొక్కలు పెంచేందుకు మొక్కవోని దీక్ష చేపట్టకపోయినా వేడుకకో మొక్క నాటితే చాలు. పండుగలు, పబ్బాలతో పాటు ప్రతీ ఒక్కరికీ ఓ ప్రత్యేకమైన రోజు ఉంటుంది. పుట్టినరోజు, పెళ్లిరోజు ఇలా ప్రత్యేకమైన సందర్భాల్లో మొక్కనాటితే గుర్తుగా గుర్తుంటుంది. ప్రకృతికి సాయం అందించనట్లవుతుంది.

లక్ష్యంగా లక్ష విత్తనాల సేకరణ

పట్టణానికి చెందిన అవిరెండ్ల సందీప్‌కుమార్ మిత్రబృందంతో కలిసి లక్ష విత్తనాల సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నాడు. గాంధీనగర్ యూత్ ఆధ్వర్యంలో వేసవిలో సేకరించిన విత్తనాలకు వర్షాకాలంలో నాటించేందుకు చర్యలు చేపడుతున్నాడు. పచ్చదనాన్ని పెంచి పోషించడమే లక్ష్యంగా సందీప్‌కుమార్ చేపట్టిన విత్తన సేకరణ ఉద్యమంలా సాగుతోంది. వేప, మామాడి, సపోట, నేరేడు, గానుగ, కాసియా ఫిస్టులా తదితర జాతులకు చెందిన విత్తనాలను సేకరిస్తూ పర్యావరణ రక్షణ కోసం నడుం బిగించారు. స్మార్ట్ ఫోన్ చేతబూని



మొక్కంటే ప్రాణం.. చెట్లంటే మక్కువ..

పట్టణానికి చెందిన ప్రైవేట్ ఉపాధ్యాయుడు రావుల శ్రీనివాస్‌కు మొక్కలంటే ప్రాణం.. చెట్లంటే మక్కువ.. ఉన్నత విద్యనభ్యసించిన శ్రీనివాస్ వాహనం సైకిలే. పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడే శ్రీనివాస్ విద్యార్థులకు విద్యతో పాటు ప్రకృతి పాఠాలు బోధిస్తున్నాడు. విత్తులు నాటడం, మొక్కలు పెంచడం, పరిరక్షించడంపై చిన్నారులకు తర్ఫీదునిస్తుంటాడు. తీరిక సమయాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఆయన మొక్కలు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. అంతేకాక మొక్కలు నాటండీ... పర్యావరణాన్ని పరిరక్షించండి అంటూ ప్రధాన కూడళ్లలో ఫ్లకార్డులు ప్రదర్శిస్తుంటారు.

లక్ష విత్తనాల సేకరణే లక్ష్యం



వేసవిలో ఉష్ణోగ్రతలు ఏటేటా పెరుగుతున్నాయి. దీనికి పచ్చదనం తగ్గడమే. పచ్చదనాన్ని పెంపొందిస్తే ఎండ తీవ్రత కొంతైనా తగ్గుతుంది కదా. అందుకే మిత్రులతో కలిసి విత్తనాలు సేకరిస్తున్నా.. వనజీవి రామయ్య స్ఫూర్తితో ఈ సీజన్‌లలో లక్ష విత్తనాలను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. సేకరించిన విత్తనాలను వర్షాకాలంలో పర్యావరణ నిపుణుల సలహా, సూచనలతో ఖాళీ స్థలాల్లో చల్లుతాం.

- అవిరెండ్ల, సందీప్‌కుమార్

అభివృద్ధి పేరుతో ఆపద సృష్టించవద్దు



విస్తరణ, అభివృద్ధి పేరుతో చెట్లు, భారీ వృక్షాలను నరికివేయడం ఆపద సృష్టించడమే. తప్పనిసరి పరిస్థితుల్లో చెట్లను తొలగించాల్సి వస్తే రీప్లేస్ చేయాలి. ఒక్క చెట్టును నరికితే పది మొక్కలు నాటాలి. నాటిన మొక్కలను పరిరక్షించాలి. పచ్చదనం, హరితహారంపై ప్రభుత్వాలు ప్రచారానికే పరిమితం కాకుండా చర్యలు కూడా తీసుకోవాలి. మొక్కలు నాటి సంరక్షిస్తామని ఎవరైనా ముందుకు వస్తే సొంత ఖర్చులతో మొక్కలు ఉచితంగా అందజేస్తా.

- రావుల శ్రీనివాస్, పర్యావరణ ప్రేమికుడు

మాజీ సర్పంచ్ కన్నీలాల్ మృతి బాధాకరం

● నివాళులర్పించిన మాజీ మంత్రి హరీ‌ష్‌రావు



కన్నీలాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హరీ‌ష్‌రావు, నాయకులు

దేవరకొండ, మే 20: బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ తండ్రి, రత్యతండా మాజీ సర్పంచ్ కనిలాల్ మృతి బాధాకరమని మాజీ మంత్రి టి.హరీ‌ష్‌రావు అన్నారు. దేవరకొండలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కన్నీలాల్ చిత్రపటానికి సోమవారం ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కన్నీలాల్ కుమారుడైన రవీంద్రకుమార్ కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా హరీ‌ష్‌రావు మాట్లాడుతూ కన్నీలాల్ రత్యతండా సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై గ్రామ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని అన్నారు. కన్నీలాల్ మృతికి సంతాపం తెలిపిన వారిలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నోముల భగత్, కంచర్ల భూపాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు కంచర్ల కృష్ణారెడ్డి, నాయకులు రాంబాబునాయక్, అంజనేయులు, లింగారెడ్డి, రాజు, కృష్ణ పాల్గొన్నారు.

హరీ‌ష్‌రావుకు ఘన స్వాగతం

కొండమల్లేపల్లి: మాజీ మంత్రి హరీ‌ష్‌రావు దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ కుటుంబసభ్యులను పరామర్శించేందుకు దేవరకొండకు వెళ్తూ మార్గమధ్యలో కొండమల్లేపల్లి మండలంలోని కేసీఆర్ తండాలో కాసేపు ఆగారు. ఈ సందర్భంగా అక్కడి ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. కేంద్రప్రభుత్వం నుంచి అన్ని సౌకర్యాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో విఫలమైందని అన్నారు. అనంతరం దేవరకొండకు బయల్దేరి వెళ్లారు. ఆయన వెంట నాయకులు కేసాని లింగారెడ్డి, రావుల వెంకటయ్య, దస్రూనాయక్, తులసీరాం తదితరులు ఉన్నారు.

నేడు తన్నీలాల్ సంతాప సభకు కేటీఆర్ రాక

దేవకొండ: దేవరకొండ పట్టణంలోని సాయిరమణ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించే మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ తండ్రి కన్నీలాల్ సంతాభ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నట్లు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గాజుల ఆంజనేయులు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

అభిమానులు సేవా కార్యక్రమాలు చేపట్టాలి



నల్లగొండ ప్రభుత్వాస్పత్రిలో అన్నదానం చేస్తున్న అభిమానులు

నల్లగొండటౌన్, మిర్యాలగూడ రూరల్, మిర్యాలగూడ టౌన్, మే 20: అభిమానులు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఎన్టీఆర్ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు లాకా రాజశేఖర్ అన్నారు. సినీహీరో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం జిల్లాలోని పలు పట్టణాల్లో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రాస్పత్రిలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మిర్యాలగూడ మండలంలోని కొత్తగూడెం గ్రామంలో గల మహర్షి దయానంద సేవాశ్రమ ట్రస్ట్ వృద్ధ, అనాథ బాలుర ఆశ్రమంలో 50 మంది వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. అభిమానులు రక్త, నేత్ర, అవయవ దానాలపై అవగాహన కల్పించాలని, ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూడాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు బత్తుల నాగరాజు, ఉపాధ్యక్షుడు అరవింద్, డివిజన్ ఇన్‌చార్జి అజయ్, సహాయ కార్యదర్శులు ఎస్‌కె.యూసుఫ్, సిలివేరు శంకర్, శ్రీను, రవీందర్, అరుణ్, మునాసు శివ, మని, వినోద్, నరేష్, రమేష్, మిర్యాలగూడలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఇండ్ల గణేష్, బంటు రాజు, సలీమ్, ధర్మతేజ, సమ్మెట ఉపేందర్, శ్రీను, శివశంకర్, మాధవ్, రవి, నిలేష్, శోభన్, శివ, నవీన్, సతీష్, మాధవ్, ముజీబ్, రాము పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వస్తువులు దగ్ధం



కాలిపోయిన వస్తువులు

దామరచర్ల, మే 20: ఈదురుగాలులతో కూడిన వర్షం రావడంతో విద్యుదాఘాతానికి గురై ఇంట్లోని వస్తువులు దగ్ధమయ్యాయి. ఈ సంఘటన మండలంలోని గణేష్‌పాడు గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం రావడంతో గ్రామానికి చెందిన మెగావత్ బాలు ఇంట్లో ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో విద్యుదాఘాతంతో ఫ్రిజ్, కూలర్, టీవీ, ఫ్యాన్, బట్టలు, బియ్యంతో పాటు ఇతర సామగ్రి కాలిపోయినట్లు తెలిపారు. గమనించిన స్థానికులు వెంటనే మంటలను ఆర్పివేసినట్లు తెలిపారు. దీంతో తనకు సుమారు రూ.1లక్ష ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు బాలు కోరాడు.

ఇష్టంతో చదివితే ఉత్తమ ర్యాంకులు : కలెక్టర్



10 జీపీఏ సాధించిన విద్యార్థులతో కలెక్టర్ హరిచందన

నల్లగొండ టౌన్, మిర్యాలగూడ టౌన్, తిరుమలగిరి(సాగర్): మే 20: ఇష్టంతో చదివితే ఉత్తమ ర్యాంకులు సాధించవచ్చని, విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని కలెక్టర్ హరిచందన సూచించారు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ, గిరిజన వసతి గృహాల్లో ఉంటూ కష్టపడి చదివి పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆమె విద్యార్థుల ను అభినందించి ప్రశంసాపత్రం, జ్ఞాపికలను అందజేసి మాట్లాడారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచి కష్టపడి చదివి మంచి ప్రతిభ సాధించి భవిష్యత్తులో సమాజంలో ఉన్నత స్థానం పొందాలని, ఒక గొప్ప లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ లక్ష్యసాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ హాస్టళ్లలో ఉంటూ కష్టపడి చదివి పదికి 10 జీపీఏ సాధించడం సంతోషకరమని, వారిని ఆదర్శంగా తీసుకుని ఇతర విద్యార్థులు కూడా బాగా చదివి మంచి మార్కులు పొందాలని కోరారు. విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి, హౌజింగ్ పీడీ రాజ్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, ఏటీడీవో లక్ష్మారెడ్డి ఏసీఎంవో డీవీ నాయక్, ఏఎస్‌డబ్ల్యూ వెంకటకృష్ణ, హాస్టల్ వార్డెన్లు రుణాదేవి, ఝాన్సీ, లక్ష్మయ్య, లక్ష్మారెడ్డి, సావిత్రి, సీత, దేవి తదితరులు పాల్గొన్నారు.

ఐక్య గురుకులాల కన్వీనర్‌గా గాదె లింగస్వామి



నియామకపత్రాన్ని అందుకుంటున్న లింగస్వామి

నల్లగొండటౌన్, మే 20: ఐక్య గురుకులాల కన్వీనర్‌గా, పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన గాదె లింగస్వామి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం టీపీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పార్వతి సత్యనారాయణ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా గురుకులాలలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని అన్నారు.

జీపీ కార్మికుల వేతనాలు ఇవ్వకుంటే కలెక్టరేట్ ముట్టడిస్తాం

నల్లగొండ రూరల్, మే 20: గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు ఇవ్వకుంటే కలెక్టరేట్‌ని ముట్టడిస్తామని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి చినపాక లక్ష్మీనారాయణ హెచ్చరించారు. పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవనంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 844 గ్రామ పంచాయతీల్లో సుమారు 3400 మంది కార్మికులు పనిచేస్తున్నారని అన్నారు. అందులో పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వీధి లైట్ల నిర్వహణ, పన్నుల వసూళ్ల తదితర పనులు చేస్తున్నారని అన్నారు. వారికి వచ్చే చిన్న వేతనాలతో కుటుంబాలు వెల్లదీస్తున్నారని అన్నారు. చిన్న వేతనం కూడా పది నెలలుగా రాకుండా పెండింగ్‌లో ఉన్నాయని, దీంతో వారు పరిస్థితి అధ్వానంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు ఇవ్వాలని అధికారులను ఇవ్వాలని అడిగితే డబ్బులు లేవని సమాధానం చెబుతున్నారని, ఇదే అదునుగా కొందరు వారిని తొలగించాలని కుట్రలు చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ వేతనాలను విడుదల చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, అదే విధంగా మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం అమలు చేయాలని, అర్హత కలిగిన కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో ఈ నెల 28వ తేదీన ఎంపీడీవో కార్యాలయాల ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. అప్పటికి స్పందించకపోవతే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. సోలే సాంబయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, నాయకులు అంజయ్య, జహీర్, సర్వయ్య పాల్గొన్నారు.

'ఇష్టానుసారంగా టెట్ కేంద్రాల కేటాయింపు'

మిర్యాలగూడ టౌన్, మే 20: టెట్ కేంద్రాల కేటాయింపు గందరగోళంగా జరిగిందని బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథనాయక్ అన్నారు. సొంత జిల్లాలోని కేంద్రాల్లో కేటాయించాల్సిన అభ్యర్థులకు దూరపు ప్రాంతాల్లో కేటాయించనట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించేందుకు జిల్లాలో అన్ని సదుపాయాలు ఉన్నా స్థానిక అభ్యర్థులను ఖమ్మం, రంగారెడ్డి, సంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు కేటాయించడం సరికాదన్నారు. టీచర్ల పదోన్నతులకు టెట్ పాస్ కావాలనే నిబంధన లేకపోయినా విద్యాశాఖ ఉన్నతాధికారులు ముందస్తు ప్రకటన చేశారని, దీంతో వేలాది మంది టీచర్ల పరీక్షకు దరఖాస్తు చేసుకుని ఆర్థికంగా నష్టపోయినట్లు తెలిపారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు టెట్ కేంద్రాల కేటాయింపులో మార్పులు చేయాలని వారు కోరుతున్నారు.

సంక్షిప్త సమాచారం...

నేడు నల్లగొండకు మాజీ మంత్రి కేటీఆర్ రాక

నల్లగొండ టౌన్: మాజీమంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు మంగళవారం నల్లగొండకు రానున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించినున్న సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగు రాకేష్‌రెడ్డి గెలుపు కోసం పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేయనున్నారు.

డిగ్రీ రెండు మూడు సెమిస్టర్ పరీక్షలు వాయిదా

రామగిరి: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 27వ తేదీ జరగాల్సిన డిగ్రీ రెండు మూడు సెమిస్టర్ల పరీక్షలను వాయిదా వేసినట్లు మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ జి.ఉపేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 27వ తేదీన నిర్వహించాల్సిన సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలను జూన్ 13వ తేదీన నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈ మార్పు విషయాన్ని విద్యార్థులు గమినించాలని ఆయన కోరారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీల హక్కులను కాల రాసేందుకు బీజేపీ కుట్ర

శాలిగౌరారం: ఎస్సీ, ఎస్టీ, బీసీ హక్కులను కాలరాసేందుకు బీజేపీ ప్రయత్నిస్తుందని కాంగ్రెస్ నాయకుడు వేముల గోపినాథ్ ఆరోపించారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని ఆయన కోరారు. రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని, 400 సీట్లు ఇవ్వాలని ప్రచారం చేస్తున్న నరేంద్ర మోదీ అభ్యర్థికి పట్టభద్రులు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తుంటే కేసీఆర్ వేసిన నోటిఫికేషన్‌లని ప్రచారం చేస్తున్నారని, మరి రాష్ట్రంలో 7లక్షల కోట్లు అప్పు ఎవరి ఖాతాలో వేయాలని ఆయన ప్రశ్నించారు. మల్లన్న ఎందుకు జైలుకు పోయిండు మల్లన్నపై ఎన్ని కేసులు ఉన్నాయో వీటికి కారణం ఎవరో పట్టభద్రులకు తెలుసునని పేర్కొన్నారు. పట్టభద్రులంతా తీన్మార్ మల్లన్న మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించుకుందామన్నారు.

ఆలయాభివృద్ధికి సహకరించాలి

మిర్యాలగూడ టౌన్: ఆలయ అభివృద్ధికి అందరి సహకారం అవసరమని మునిసిపల్ చైర్మన్ తిరనగరు భార్గవ్ అన్నారు. ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణ కమిటీ సోమవారం చైర్మన్‌ను కలిసింది. ఈ మేరకు ఆయన ఆలయ అభివృద్ధి కోసం రూ.1.50 లక్షలు అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భార్గవ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కోల సైదులు, బంటు సైదులు, మెరుగు రోషయ్య, రామస్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

డిండి: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి పున్న దినేష్ అన్నారు. మండలంలోని చెర్కుపల్లి గ్రామంలో సోమవారం క్రీడాకారులకు ఆయన క్రికెట్ కిట్లు పంపిణీ చేసి మాట్లాడారు. యువత క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కోరారు. ఎన్ఎస్‌యూఐ క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సునీల్‌రెడ్డి, మల్లేష్, గోవర్ధన్, ప్రేమ్‌కుమార్, రాంరెడ్డి, సత్యం, సోమయ్య, వహిద్, శేఖర్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

శాలిగౌరారం: శాలిగౌరారం మండలం గురజాల జడ్పీ హైస్కూల్‌కు చెందిన 2005-06 ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 19 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారికి సంతోషానికి అవధులు లేవు. ఒకరినొకరు ఆప్యాయతగా పలకరించుకుని తమ బాల్య జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అప్పటి హెచ్ఎం నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు రామోహన్, కరుణాకర్, నర్సిరెడ్డి, శ్రీనివాసచారి, రామిరెడ్డి, వాసు, సునీతలకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు పొన్నబోయిన రమేష్‌కుమార్, వి.సైదులు, సైదులు, మీరయ్య, రాంరెడ్డి, యాదగిరి, మహాలక్ష్మి, జ్యోష్న, గోపినాథ్, కార్తీక్ పాల్గొన్నారు.

పచ్చి రొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

మాడ్గులపల్లి: ప్రభుత్వం సబ్సిడీపై అందించే పచ్చి రొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో సైదానాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, పిల్లిపెసర, జనుము వంటి విత్తనాలు ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో సబ్సిడిపై లభ్యమవుతాయని అన్నారు. పచ్చిరొట్టి విత్తనాల వల్ల నేల సారవంతమవుతుందన్నారు.

ప్రజల పక్షాన నిలబడే వ్యక్తినే గెలిపించాలి

● ద్వాబ్ ప్రధాన కార్యదర్శి పానుగోటి చొక్కారావు



చొక్కారావు

నల్లగొండ టౌన్, మే 20: ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఎమ్మెల్సీ ఎన్నికలో ప్రజల పక్షాన నిలబడే వ్యక్తినే గెలిపించాలని ద్వాబ్ ప్రధాన కార్యదర్శి పానుగోటి చొక్కారావు పట్టభద్రులను కోరారు. సోమవారం నల్లగొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తనకు 1980 నుంచి పరిచయం ఉన్న వ్యక్తి అని, ఆయన తను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉండే వ్యక్తి అని కొనియాడారు. రాబోయే రోజుల్లో ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకగా పనిచేస్తారని పేర్కొన్నారు. పోటీలో ఉన్న కొందరు అభ్యర్థులు ఆస్తి అంతా ప్రభుత్వానికి ఇచ్చిన, తన జీతం ప్రజలకు పంచుతానని ఓట్లు అడుగుతున్నారని, వారిలో ఎవరూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చలేరన్నారు.